# అ ఆ లు నేర్వని అయ్యోరమ్మ!

బతుకు! అది ఉండాదే శానా యిచ్చిత్ర మయింది. కొర్రు మాదిర్తో చూడ బహుసొంపుగా ఉంటింది. లోపలికి పోదామంటే సముద్రమంత లోతయింది. అర్తం చేసుకుందామంటే ఆకాశిం మాదిర అర్తం కానిది. అదొక బంగారు లేడి. అందుకే ఎంత సతమతమయినా మాయలేడి మాదిర్తో చిక్కినట్టే దక్కినట్టే మణుసుల్తో చెలగాటం ఆడ్తింది.

దానెమ్మ బడవ! అంతా తెల్సినట్టే ఉంటింది. మల్లా చూడబోతే ఏమీ తెల్దు. అంతా అర్తమయినట్టే ఉంటింది. అయితే అంతా అయోమయం కళ్లేడుపు గానే కనబడ్తింది. ఏసే ప్రెతి అడుగు నిదానించి చూసి ఎంతో జాగర్తగా ఏసినట్టే ఉంటింది. మల్లా కాలుజారేది మాత్రం తప్పదు. ప్రెతిదీ కంటి చూపుకు ఆనినట్టే ఉంటింది. అయితే వొగిటీ నిలకడగా నిల్సిచావదు.

అందుకే అది బతుకయింది! ఈ బతుకుల్లో మరుపు ఉండాదే అదొక వరం. లేకుండాబోతే ఒక్క అడుగు ముందుకు ఎయ్యలేము. ఆడది గూడా అంతే! అసలు ఆడదాని బతుకే మహా అద్భుతం. ఒక్క రాగాన అర్తం గాదు. అర్తం కాలేదు గదా మర్సిపోదామంటే అదే యీాలు పడదు. నిజిమా? అంటే– అవును మరి? ఈ జల్మాన్ని యిచ్చింది ఆడదే? జత కల్సిందీ ఆడదే! జత గూడిందీ ఆడదే! బతుకు కడ దాక కూడా మాడా ఉండేదీ ఆడదే!

ప్రెతి మణిసికి ఆడదాని అవసరం ఉండాది. అయితే మణిసి ఆడదాన్ని గురించి యింత లోతుగా ఆలోచిస్తా ఉండాడా అంటే అదే సందేహం. అయితే అవసరం వచ్చినప్పుడు మాత్రం మణిసి పడే తపనుండాదే?– అది యిట్టా అని చెప్పేదానికి అలివి మాల్దు.

ఈ పొద్దు బతుకును గురించి యింత యిదిగా ఆలోచిస్తా ఉండానంటే అంతా ఆ కడుపు చలవే గదా? ఆ కడుపు చలవనే కట్టెల్లోపెట్టి మంట పెట్టేదంటే మాట్లా? కట్టె మండలేదంటే డబ్బా కిర్సనాలు పోసి గదా కాల్సింది.

అప్పుడెప్పుడో ముప్పైయేండ్లకు మునుపు ఉద్దోగానికి ఎలబారి పోతావుంటే– నిన్ను వొంటిగా యిడ్సి పెట్టేసి నన్నెట్టా బతకమంటావురా కొడకా! అంటా కొంగెత్తి మొకాన

ఏసుకోని ఏడ్సింది నాకీ జలమాన్నిచ్చిన తల్లి. ఆ పొద్దు అట్టా ఏడ్సిన మణిసి ఈ పొద్దు నన్నిట్టా ఏడవమని ఒగిటే పారిగా యిడ్సి పెట్టేసి పాయ. యాడికి పొయ్యిందో? ఎట్టా పొయ్యిందో? పాయ్ ఎట్టా బతకతా ఉండాదో? ఆ బగుమంతుడికే ఎరిక!

చూడబోతే యిదొక తమాసగా ఉండాది. పిలకాయిలు బొమ్మరిండ్లు కట్టు కుంటారు. ఆడుకున్నెంత సేపు ఆడుకుంటారు. ఆట అయిపోతానే పాలో! మని తుడ్సి పారేసి పోతా ఉంటారు. ఇది గూడా అట్టమాదిరి కతగానే ఉండాది. ఆ కతకేనా? ఓయబ్బా? ఎన్ని కుమ్ములాట్లు? ఎన్ని అగసాట్లు? ఎన్ని ఎనకపోట్లు! ఎన్నెన్ని సిగపట్లు? చెప్పేదానికి పూనుకుంటే ఈ కతకంటే ఆ కతే శానా పెద్దదిగా ఉంటింది.

కాకి పిల్ల కాకికి ముద్దు. ఎవురి అమ్మంటే వాళ్లకిష్టం! అయితే మాయమ్మ కత అట్టాగాదే?

నూట పదేండ్లు బతికె! బతికినంత కాలం బతుకంటే యిట్టా బతకాల్రా అబ్బోడా! అని చెప్తానే బతికె.

''ఇంకొక అయిదారేండ్లకు దాటుకునేస్తింది!'' అనేటప్పుడు కూడా కాలూ చెయ్యి దాచి పెట్టకోకుండా బతికినే. అట్టా బతికేదంటే మాట్లా? కొందురైతే అరవై డెబ్బై ఏండ్లకే కూసుంటే లెయ్‌లేరు. లేస్తే కూసో లేరు. మాయమ్మ అట్టాగాదే. నూరేండ్లు పైబడేదాకా మిద్దూరికి మొగలాయి మాదిర్తో పోతా వస్తా ఉన్నె! శనిక్కాయలు తొవ్విస్తా ఉండె. చింతకాయిలు రాలిపిస్తా ఉండె. మూట్లుగట్టి తెచ్చి కొడకలకు యిస్తా వుండె.

తిరపతికి మిద్దూరికి బస్సులో అట్టా మాదిరి తిరగతా ఉన్నెప్పుడు వాడెవుడో కండక్టరు–

''ముసిల్దానా! నిన్ను ఎప్పిట్నుంచో చూస్తానే ఉండా. నువ్వు అట్నే ఉండావు. నీకు చావేలేదు పో!'' అన్నాడంట.

అంత మాట ఎత్తుకోని యింటికాడి కొచ్చి–

''అవునా అబ్బారే? నాకు చావేలేదంట గదరే?'' అని అడిగె.

''నిజిమేనమ్మా! నీకు చావే లేదు'' అంటే

''వాడెవుడో పిచ్చోడనుకుంటే నువ్వొక పిచ్చినా కొడుగ్గా ఉండావే? నూకలు చెల్లిపోతే నువ్వెవురు? నేనెవుర్రా?'' అంటా ఒక ఎర్రి నవ్వు నవ్వె.

ఈ ప్రపంచమంటే పెనుమూరు పాతగుంట తిరపతి అనుకుండే తిక్క మణిసి నా తల్లి. ఆమెకు ఎవురు నేరిపించినారు యింత యాదాంతాన్ని?

ఆ మద్దె ఒకనాడు. నేను పురాణం సుబ్రమణ్య శర్మ తిరపతిలో కల్సుకున్నాం. కార్లో తిరుమల కొండకు పోతావుండాం. నడి దోవలో ఎవురిదో ఒక జీపు చెడిపాయ్ ఉండాది. కదిల్తే బండి. కదలకపోతే బండగదా? దాని డ్రైవర్ యింజన్లో తలకాయి దూర్సేసి ఏందో కలబెట్టుకుంటా ఉండాడు. ఆ జీపులో పోతా వుణ్ణింది యిద్దురే. ఆలూ మొగుడుగా ఉండారు. పాపం! వాళ్లాదోవలో నిలబడుకోని వస్తాపోతా వుండే బస్సుల్ని కారుల్ని

దేబిరించుకోని చూస్తా వుండారు. ఎవురి తాపేత్రం వాళ్లదిగా పోతావుంటే ఈళ్లను ఎవురు పట్టించుకుంటారు? ఈళ్ల మాత్రం చూస్తా నిలబడుకోని ఉండారు.

నేను కార్ను నిలబెట్టమన్నా. కార్లో ఉండేది మేము యిద్దరే గదా? ఆ యిద్దర్నీ కారెక్కమన్నా. కొండ మిందికి తీసుకోని పోయ్‌నా. దేముడి దర్సినం చెయ్‌పించినా. జీపును రిపేరు చెయ్యించే దానికి దేవస్తానం వాళ్లతో చేప్పి మెకానిక్కును పంపించినా. రొండు బస్సు టిక్కట్లుకొని వాళ్ల చేతికిచ్చి వాళ్లను తిరపతికి పొయ్ బీమాస్ హోటల్ దగ్గిర ఉండమన్నా. ఆ లోపల్నే జీపు రేపైరై ఆడికి పోతింది. మల్లా వాళ్ల దోవన వాళ్లు పోతారు.

ఇదంతా చేసిందానికి వాళ్ల దండాలు... దండకాలు... ఓ యబ్బా! ఆ కతంతా ఎందుకు గానీ పురాణ మాయిన మాత్రం 'క్రిష్ణారెడ్డీ! యిదంతా నీకెట్టా అబ్బింది!' అని అడిగె.

''మా యమ్మ నుంచి వొచ్చింది సా!'' అంటి.

''నిజిమా!''

''కష్టంలో ఉండే వాడికి వాడు పగోడైనా సరే శాతనైన కాడికి చెయ్యి అందించకుండా పోతే ఆ జల్మం ఉన్నా వొగిటే! ఊన్నావొగిటే! ఇదే సా! మాయమ్మ నాకు నేర్పించిన మంత్రం''

ఆయన మల్లా ఏమీ మాట్లడలా. అయితే మాయమ్మ మాట మాత్రం నా మింద మంత్రం మాదిరి పని చేసింది. వాడెవుడైనా సరే! ఎతుక్కుంటా నా కాడికొస్తే ఎనుకూ మూందూ చూసే పనేలే. ఎత్తి నెత్తిన్నే ఏసుకుండేది. శాతైనా కాడికి చెయ్యి అందిచ్చేది. ఇప్పటికీ మా బాశాలి–

''ఇంట్లో వాళ్లకంటే ఈదిలో వాళ్లదంటే ఈయనకు శానా రుచి!'' అని దెప్పి దెప్పి పొడస్తానే ఉంటింది.

ఒకామె కనింది. ఒకామె కట్టుకునింది! ఇద్దర్లోనే ఎంత తేడా?

పల్లెల్లో రైతులు పండించేది పేటలకు మోసుకొని పొయ్ సంతల్లో అమ్ముకుంటారు. అణ్ణే ఇంటికి కావాల్సిన గుడ్డాగుసురు ఉప్పుపొప్పు కొనుక్కుంటారు. శానామంది సంతలకు పోలేకుండా ఊళ్లల్లోనే మారుబేరగాళ్లకు అమ్మేస్తా ఉంటారు. మాయమ్మకు అది వొప్పదే?

''ఇదేందిది? యిచిత్రంగా ఉండాదే? పండించేది మనం. అమ్మేది యింకొకడా? ఎవుడది చెప్పింది? అప్పటికి మనకాపని శాతగాదనేగదా దాని అర్తం. బిడుక్కోల్! అదెంతా ఏమీ కుదర్దు'' అంటే–

మాఅయ్య సంతనాడు పొద్దు నడిమిట్ట మిందికి వచ్చిరాక ముందే రొండున్నర మణుం ఎర్రగెడ్డలు అలాగ్గా నెత్తి కెత్తుకుంటాడు. మాయమ్మ చేతులూగించుకుంటా మాఅయ్య ఎంట పడ్తిందా? అట్టా పోతే ఆమె మాయమ్మ ఎట్టవితింది? మా అయ్యతో పోటా పోటీగా యించుమించు అంతే బొళువు నెత్తికెత్తు కుంటింది. ఇద్దరు పరుగు నడగ్గా పొద్దు తిరగక ముందే పెనుమూరు చేరుకుంటారు. మా అయ్య 'నీ తలపాడు నువ్వ

పడు?' అంటా ఆ మూట యిసిరాడ పారేసి యింటికి తిరుక్కుంటాడు.

ఇంటికి వస్తాడు గదా? వచ్చి అట్టా నడుం వాల్చేపని ఏమయినా ఉండాదా? లేదే? మల్లా యదాపకారం మడక కట్టోన్నీ మోట తోల్నోన్నీ ఎసుర్లు పెట్టే యాళకాడికే ఎలబారి పోతా ఉండేదే గదా?

మాయమ్మ సంత నుండి తిరుక్కోని వచ్చేకుందికి కూటేళవుతుంది. అందురు తినే కాడికి ఎమ్మాతక్కువగా జామురేత్రి అవితింది. అప్పుడు మాయమ్మ సంత నుండి తెచ్చిన దుడ్లు దీపెం ముందర కుప్పపోస్తే మాఅయ్య మా పెద్దన్న దమ్ముళ్లు కాలణాలు అణాలు రూకలు పావలాలు తనితనిగా ఏరిపించి లెక్కపెడ్తా ఉంటే వెంకటేశ్వరుడి గుడిలో పరకామణి జరిగినట్టుండేది.

ఆ పరకామణి కత్తై పోతానే మా రామన్న తమలపాకులు తెచ్చి ఆడ కుప్ప పోస్తాడు. ఆ తమలపాకుల్ను ఎంచేదానికి మాయన్నోళ్లతోగూడా మాయక్కోళ్లుగూడా కూసుంటారు. నూరాకులు వొక పిడి. అట్టా మాదిర పది పిళ్లు ఒక కట్ట. కట్టంటే ఎయ్యి ఆకులు! పిళ్లు పిళ్లుగా ఎంచి మాఅయ్య చేతికి యిస్తావుంటే ఎడంకాలి పాదం మిందనుండి మోకాలిదాకా ఆ పది పిళ్లను మాఅయ్య సోలుపుగా పేర్చి కట్ట కట్నాడంటే?– ఆ కట్ట ఎట్టుంటుందో తెల్సా? ముద్దు బెట్టుకుందాం అన్నెంత ముచ్చటగా ఉండేది.

''అయ్యా! అయ్యా! యింత సుద్దంగా కట్టలు కట్టేదానికి ఎవురు నేర్పించి నారయ్యా?'' అంటే–

''ఒకరు నేర్పించి యింకొకరు నేర్చుకుండేదానికి అదేడ అవితిందిరా? గుష్టి పెట్టి చూడాల. నేర్చుకోవాల.'' అంటా నవ్వేటోడు.

ఎప్పుడన్నా మా పెద్దన్న కట్టకట్టాలని మునాస పడి వొక్కాముక్కల కడ్తే–

''ఒరే యదవా! కట్టగట్టి యిసిరి ఏట్లో పారేస్తేగూడా అది అట్టాయిట్టా అసిగుసి అనొచ్చునా?'' అంటా నవ్వేటోడు.

ఒకొకదినం అయితే తమలపాకులు కట్టలు కట్టే కుందికి తొలికోడి కూసేది. కంటి మింద రెప్పట్టా పడకపాయ్‌నా సరే. ఆ మర్నాటి పన్లు అప్పటినుంచే మొదులు పెట్టాల్సిందే గదా? బుదువారం పెనుమూర్సు సంతకు ఎర్రగెడ్డలు బేస్తారం పాతగుంట సంతకు తమలపాకులు మోసి మోసి మాయమ్మకు ఉచ్చి మింద బొచ్చు రాలి పొయ్యింది.

ఆమె కష్టజీవి!

నేను తిరపతిలో చదువుకుంటా ఉణ్ణెప్పుడు లీవుల్లో మిద్దూరికి పోవాలంటే బస్సు దిగితే నేడ్రంగుంటలో దిగాల. అట్టగాకుండాబోతే పెనుమూర్లో దిగాల. నేడ్రగుంటలో దిగితే అడివి దోవన ఏడెనిమిది మైళ్లు. అదే పెనుమూర్లో దిగితే నాలుగు మైళ్లు. ఎప్పుడైనా అడివిదోవన ఒంటిగా బిక్కు బిక్కుమని నడ్సేదానికి పాలుమాలి పెనుమూర్లో దిగిపోతే–

''ఒరే అబ్బోడా! నడ్సేది ఎట్టా నాలుగు మైళ్లు నడ్సినావుగదా? అట్నే యింకొక మూడేమూడు మైళ్లు మనవి కాదనుకుంటే ఆరణాలు మిగిలేవి గదరా?'' అనేది.

''ఆరణాలే గదమ్మా?'' అంటా నసిగితే-

''అబ్బోడా! మీఅయ్య బానాతొండం కుట్టించాలని కొత్తచర్మం కొనుక్కోని వచ్చేదానికి కోడిగూసే యాళకాడ లేసి సద్దికూడు మూట చంకకు తగిలించుకోని చిత్తూరికి ఎలబారిపాయ. చిత్తూరి రేటుకు వేలూరి రేటుకు రొండు రూపాయిలు తేడా ఉణ్ణిందంట. ఆడనుంచి అట్నే వేలూరికి నడ్సినాడు. చర్మం కొనుక్కోని సగంరేత్రికి యిల్లుచేర్నాడు. తిరపతి నించి వొచ్చేదానికి ఒక రూపాయి. పొయ్యేదానికి ఒక రూపాయి. ఈ రొండు రూపాయిలూ మిగలబెట్టే దానికి గదా మీఅయ్య నలభై నలభై ఎనభైమైళ్లు నడ్సింది. ఇట్టా మిగలబెడ్తేనే గదా మీరు యింతటోళ్లు అయింది. తెల్సుకోని బతకాల్రా నాయినా!'' అనె.

ఆమె చిక్కనైన మణిసి!

ఒక మణిసి ఒక దినంలో డెబ్బైఆరు మైళ్లు నడ్సేదంటే మాట్లా? ఈ మాట నమ్మొచ్చునా? అంటారేమో?-

పెనుమూర్లో చదువుకుంటా ఉణ్ణెప్పుడు నేనే తెల్లార్తో లేచి చిత్తూరికి పాయ్ వెంకట్రామా వాళ్ల అంగిడిలో పుస్తకాలు కొనుక్కోని సందేళకాడికి యిల్లు చేర్తే యింక మా అయ్య కత పెప్పాల్నా?

నువ్వు కట్టెలమ్ముకో... కాపీపొడి ఎత్తుకోని గడప గడప తిరుగు. ప్రెస్సులో పని చేసుకో... నీ చెమటను నువ్వు నమ్ముకుణ్ణెంత కాలం ఒక యదవ ముందర తలకాయి వంచాల్సిన పనే లేదనే ఆత్మవిశ్వాసాన్ని నేరిపించింది నా తల్లి జీవితం!

రూపాయి యిలవ పదుమూడు పైసలకు పడిపోయిన దినాల్లోగూడా రూపాయికి నూరు రూపాయిల యిలవగట్టే జాగర్తను నేర్పించింది నా తల్లి జీవితం!

అందరి తల్లులు అందురి బిడ్డలకు జల్మాలిచ్చిన తల్లులే. అయితే నా తల్లి మాత్రం నాకీ జల్మంతో గూడా ఒక జీవితాన్నిగూడా యిచ్చిన అయ్యోరమ్మ!

ఇదే తల్సుకుంటా కండ్లొత్తుకుంటా ఆ నాలుగ్గాళ్లమండపం కాడ పోతా ఉంటే ముత్తారెడ్డన్న ఎదురుపడె. ఆయన్న కంట పడే కుందికి కండ్లల్లో నీళ్లు పలపల రాలె. ఆయన్న నవ్వతా-

''అబ్బోడా! అట్టా చూడ్రా!'' అనె.

ఒక ముసిల్డి. బాగా పొండుబారి పొయ్యుండాది. కొంక్రకంకు మాదిర్తో వొంగి పాయ్ ఉండాది. ఊతకట్టె మోపుతో అడుగెత్తి పెట్లేక అల్లాడిపోతా ఉండాది.

''మీయమ్మ చచ్చి పొయ్యిందని యాడస్తా ఉండావే? ఇట్టా మాదిరి అమ్మలు ఎంతమంది ఈ దేశింలో చావలేక బతకతా సతమతమవతా ఉండారో తెల్సా? వాళ్లకోసరం ఎవురు ఏడవాల్రా?'' అనె.

నా తల వాలి పాయ. కారిన కన్నీళ్లు నేల పాలై పాయ! ●